క్లుప్తంగా

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కొప్పుల

వెల్గటూర్: వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చెగ్యాం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమ్మరి మహేష్, యూత్ ప్రధాన కార్యదర్శి మేకల అరుణ్, ఎండపల్లి మండలం రాజారాంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు తోట్ల మల్లయ్య, పాత గూడూర్ నుంచి కాంగ్రెస్ యూత్ సభ్యులు గుడిమల్ల సందీప్ కుమార్ తదితరులు కరీంనగర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జీవన్‌రెడ్డికి బీసీ నాయకుల సన్మానం



జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ నాయకులు

జగిత్యాలటౌన్: బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని గళమెత్తిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బీసీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం అన్యాయమని ప్రశ్నించిన ఎమ్మెల్సీకి జీవన్‌రెడ్డికి రాష్ట్రంలోని బీసీలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. మిగతా రాజకీయ పార్టీలు జీవన్‌రెడ్డి బాటలోకి రావాలని కోరారు. వివిధ పార్టీల్లో ఉన్న బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులు బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించకపోవడం దారుణమన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న గీతారెడ్డి

రాయికల్: నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిమ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ వంగ గీతారెడ్డి అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలోని చిన్నజీయర్‌స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మీ, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు అందిస్తున్న శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్లు రఘుపతిరెడ్డి, శ్యామల, వర్దిని, జీఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారిణికి నివాళి

రాయికల్: తెలంగాణ ఉద్యమకారుల కోసం ఉద్యమించిన మహబూబ్‌నగర్‌కు చెందిన కళాకారిణి చైతన్య మృతికి సంతాపంగా రాయికల్ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మండల కళాకారులు శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాటల దారా ఉద్యమించిన కళాకారిణి చైతన్య అని, ఉద్యోగం రాకపోవడంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాకారులు సుమన్, ప్రసన్నకుమార్, డప్పుస్వామి, రాము, రజినీకాంత్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందిస్తున్న ముస్లింలు

రాయికల్: పట్టణంలో వర్షాలతో నష్టపోయిన 65 మంది బాధిత కుటుంబ సభ్యులకు శనివారం జమాతుల్ల ఉల్మా జగిత్యాల వారి ఆధ్వర్యంలో రాయికల్ పట్టణంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హఫీస్, సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, సభ్యులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్, రాఘవపేటలో వర్ష బాధిత కుటుంబాలకు శనివారం ఫెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

నిధులు మంజూరైనా.. నిర్మాణాలేవి?

- నిధులున్నా.. కానరాని పనుల జాడ
- కొనసా..గుతున్న ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల నిర్మాణం
- పూర్తి చేయాలని ప్రజల వినతి



పాఠశాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం



సిరికొండలో నిర్మాణ దశలోనే ఆరోగ్య ఉపకేంద్రం భవనం

కథలాపూర్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆరోగ్య ఉపకేంద్రాలను హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చింది. ఈ కేంద్రాల ద్వారా గర్భిణులకు నెల నెలా చెకప్‌లు చేసి వ్యాధి నిరోధక టీకాలు వేయడం, చిన్నారులకు టీకాలు వేయడం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పక్కా భవనాలు మంజూరు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల పనులు నెలల తరబడి ముందుకు సాగడం లేదు.

పక్కా భవనాలు మంజూరైన గ్రామాలు..

కథలాపూర్ మండలంలో కథలాపూర్, అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. మేడిపెల్లి మండలంలో ఒక్క మేడిపెల్లిలోనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉంది. వీటి పరిధిలో ఆయా గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. పక్కా భవనాలు మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రాలు ఇవే... కథలాపూర్ మండలంలో కథలాపూర్, సిరికొండ, అంబారిపేట, దూలూర్, తక్కళ్లపెల్లి. మేడిపెల్లి మండలంలో మేడిపెల్లి, మన్నెగూడెం, వెంకట్రావుపేట, కొండాపూర్, కట్లకుంట, పోరుమల్ల, కల్వకోట గ్రామాలకు పక్కాభవనాలు మంజూరయ్యాయి. ఆరోగ్య ఉపకేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని ఒకొక్క ఆరోగ్య ఉపకేంద్రం భవనం కోసం ప్రభుత్వం రూ. 20 లక్షలు గతేడాది మంజూరు చేసింది.

పక్కా భవనాల పనుల పరిస్థితి ఇదీ..

మేడిపెల్లి మండలంలో కల్వకోట, పోరుమల్ల, కట్లకుంట ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల పనులు టెండర్ దశలోనే ఉన్నాయి. మన్నెగూడెం, కొండాపూర్‌లో భూమిపూజ చేశారు. కథలాపూర్ మండలంలో దూలూర్, సిరికొండ గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. కథలాపూర్, తక్కళ్లపెల్లి గ్రామాల్లో స్థలం కేటాయించినా పనులు ప్రారంభంకాలేదు. నిధులు మంజూరైతే ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు.. పనులు త్వరగా పూర్తి చేయించడంపై దృష్టిసారించకపోవడం దారుణమని ప్రజలు అంటున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యం తగదు



గ్రామాల్లోని పేదలకు ప్రభుత్వ వైద్యం అందించడంలో ఆరోగ్య ఉపకేంద్రాలే కీలకం. అన్ని వసతులతో ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు నిర్మిస్తే పేద ప్రజలకు మంచి వైద్యం అందుతుంది. పక్కా భవనాలకు నిధులు మంజూరైనా.. పనుల్లో జాప్యం చేయడం సరికాదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మంజూరైన నిధులతో త్వరగా పనులు చేయించాలి.

– బొడ్డు నరేశ్, కల్వకోట

భవనాలు పూర్తి చేయాలి



ప్రజారోగ్యం విషయంలో పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలుంటే గ్రామీణ ప్రజలకు మంచి వైద్యం అందుతుంది. పక్కా భవనాలకు నిధులు మంజూరైనా పనుల్లో నెలల తరబడి జాప్యం చేయవద్దు. ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలను త్వరగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– అల్లె రాందాస్, సిరికొండ

ఐదు నెలల్లో పూర్తి చేస్తాం

రెండు మండలాల్లో 12 ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు గతేడాది మంజూరయ్యాయి. కొన్నింటికి టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభించాం. పనులను ఎప్పటికప్పుడు అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నాం. కొన్నింటికి టెండర్ ప్రక్రియ కావాల్సి ఉంది. ఐదు నెలల్లో ఉపకేంద్రాల భవనాల నిర్మాణాలు పూర్తి చేయించాలనే లక్ష్యంతో ఉన్నాం.

– నాగరాజు, ఏఈ, టీఎస్‌ఎంఐడీసీ, జగిత్యాల

గ్రామ పంచాయతీ కార్మికుల ర్యాలీ



మెట్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: పట్టణంలో శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో భాగంగా డిపో నుంచి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్‌ల మీదుగా మండల పరిషత్ ఆవరణలో ఉన్న శిబిరం వరకు ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనికి కాంగ్రెస్, ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల నిరసన

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో గ్రామపంచాయతీల నిరసనలు కొనసాగుతున్నాయి. సారంగాపూర్‌లో పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక అంజనేయస్వామి స్వామివారికి తమ డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. బీర్‌పూర్‌లోను నిరసన కొనసాగించారు.

పెగడపల్లి: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గొల్లపల్లి మండలంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నం 51ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. తమను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



ఎస్సారెస్పీ కాలువను పరిశీలిస్తున్న సంజయ్

మల్లాపూర్: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలు, రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొగిలిపేట, సిరిపూర్, కొత్తదాంరాజుపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టులు, చెరువులను శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు, బాధిత ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అసాధారణ వర్షాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను కోరారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయం అందించాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి నష్టం అంచనా వేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అధికార యంత్రాంగంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో వరదలతో దెబ్బతిన్న పంటటలు, రోడ్లు, కల్వర్టులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో వైస ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మీజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్,నాయకులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు రూ.30వేల పరిహారం చెల్లించాలి



కల్వర్టును పరిశీలిస్తున్న జువ్వాడి సోదరులు

మల్లాపూర్: భారీ వర్షాలకు పంట నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని పీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుండంపల్లి శివారులో ఇటీవల నిర్మించిన సాతారం లింక్ రోడ్డు కల్వర్టు ధ్వంసమవడంతో శనివారం జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, సోయాబీన్, వరి, పసుపు పంటలు నీటమునిగి రైతుకు తీరని ఆవేదనను మిగిల్చిందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో బాధిత రైతుల పక్షాన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండంపల్లి ఎంపీటీసీ మామిడి మంజుల, కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు మామిడి లక్ష్మారెడ్డి, చెవ్వళ్ల రమేశ్, బుర్ర సురేశ్, రెబ్బస్ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న. పంటలు, కుంటలు, చెరువులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి నర్సింగరావు శనివారం పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లు, చెరువులకు మరమ్మతులు చేయాలని, పంట నష్ట పరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, గూడ ప్రశాంత్, వెంకట్ కృష్ణ, విఘ్నేశ్, సునీల్, దేవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'గృహలక్ష్మి'లో ఇళ్లు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: అకాల వర్షాలతో నష్టపోయిన బాధితులకు న్యాయం చేస్తామని, అలాగే ఇల్లు కోల్పోయిన బాధితులకు గృహలక్ష్మీ పథకంలో ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భరోసా ఇచ్చారు. శనివారం రాయికల్ పట్టణంలోని పెద్దచెరువు వద్ద తెగిపోయిన మత్తడిని, 5,6,7 వార్డుల్లో వరద నీటితో తీవ్రంగా నష్టపోయిన బాధితులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, రాయికల్ మండలంలో వరదలతో తెగిపోయిన రోడ్లను యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేసేందుకు మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో సమీక్ష నిర్వహించి వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు నష్టపోయిన వివరాలను వెంటనే నివేదిక అందజేసి మంత్రి చొరవతో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

ఆహ్లాదకరంగా ఉద్యానవనం

జగిత్యాల: జగిత్యాలలోని రోటరీ పార్క్‌లో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పార్క్‌లో రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ లావణ్య, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం దోని నిర్మాణానికి కృషి చేస్తా

జగిత్యాలరూరల్: సాగునీటి కోసం దోని నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం జగిత్యాల పట్టణ శివారులోని కండ్లపల్లి చెరువు కట్ట పరిధిలో గల రైతుల పొలాలకు సాగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న దోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసం కాగా, రైతులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులను పంపించి ఎస్టిమేట్ చేయాలని, వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

కట్ట నిర్మాణానికి రూ.40 లక్షలు..

కండ్లపల్లి చెరువు కట్ట ప్రమాదకరంగా మారడంతో ఇటీవలే రూ.40 లక్షలు కేటాయించి చెరువు మరమ్మతులు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, సమిండ్ల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

'జీవన్‌రెడ్డిపై విమర్శలు మానుకోవాలి'

కోరుట్ల: ఎమ్మెల్సీ, జీవన్ రెడ్డిపై విమర్శలు మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ బీసి సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్ అన్నారు. శనివారం కోరుట్లలో మాట్లాడుతూ విద్యా, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో బీసీలకు ప్రాధ్యాన్యత కోసం కృషి చేస్తున్న జీవన్‌రెడ్డిపై విమర్శలు చేయటం సరికాదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ స్టేట్ ఎగ్జికూటివ్ మెంబర్ ముంజా రఘువీర్, నాయకులు పి. మహేశ్ పోతుగంటి శంకర్, పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

బుగ్గారం: ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన సేవలపై విలేజ్ బస్ ఆఫీసర్ మధు ప్రయాణికులకు వివరించారు. మండలంలోని మద్దునూర్‌లో శనివారం స్థానికులతో మాట్లాడారు. ప్రయాణికుల సంక్షేమం, సౌకర్యం, భద్రత ధ్యేయంగా ఆర్టీసీ పనిచేస్తుందన్నారు. ఆర్టీసీ అందిస్తున్న మెరుగైన సేవలను వినియోగించుకుని సంస్థను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల తిరుపతి,ఎంపీటీసీ గాలిపెల్లి మహేశ్, ఉప సర్పంచ్ ముంజాల సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని బండలింగాపూర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు.శుక్రవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో బండలింగాపూర్ మీదుగా నిజామాబాద్ వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



మాట్లాడుతున్న ఆర్ఎస్సై కృష్ణ

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఆర్ఎస్సై కృష్ణ అన్నారు. శనివారం రోడ్డు ప్రమాదాల నివారణనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో మద్యం సేవించి వాహనాలు నడిపి, ట్రాఫిక్ నియమాలు పాటించని 25 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్లే అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తూ ట్రాఫిక్ నియమాలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగిన ప్రమాదాలపై ఆడియో, వీడియోలతో అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

మెట్‌పల్లి: పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శనివారం పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇండ్ల మధ్య నిలిచిన వరద నీటిని మళ్లించాలన్నారు. మురికి కాల్వలను శుభ్రం చేసి అవసరమైన చోట బ్లీచింగ్‌ను చల్లాలన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా తగిన విధంగా క్లోరినేషన్ చేసిన తర్వాతనే సరఫరా చేయాలని సూచించారు.

రోడ్లకు మరమ్మతులు చేయించాలి

కథలాపూర్: వర్షాలతో మేడిపెల్లి మండలంలో కోతకు గురైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయించేందుకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి కోరారు. శనివారం మేడిపెల్లిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామాలవారిగా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడిపెల్లి నుంచి మొత్కురావుపేట వెళ్లే రోడ్డు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయన్నారు. రోడ్లను త్వరగా మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఉరుమల్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

చెరువులు, కుంటల పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్, మాదాపూర్, పైడిమడుగు గ్రామాల్లో చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను నీటిపారుదల ఇంజినీర్ సీరజ్ శనివారం పరిశీలించారు. దెబ్బతిన్న చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు మరమ్మతుల కోసం నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ వంతడుపుల అంజయ్య,పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



ధర్మపురిలో మొహర్రం సంబరాలు

జగిత్యాలరూరల్/ జగిత్యాల టౌన్/ రాయికల్/ ధర్మపురి/ కథలాపూర్/ ఇబ్రహీంపట్నం /సారంగాపూర్: జిల్లా వ్యాప్తంగా మొహర్రం వేడుకలు శనివారం కుల మతాలకతీతంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలకు మహిళలు దస్తీలు కడుతూ తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యువకులు పులి వేషధారణలతో చేసిన డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు వేళ యువకులు అగ్ని గుండం వద్ద యువకులు అసోయిదులా ఆడి శుభాకంక్షలు తెలుపుకున్నారు.

సంక్షిప్త వార్తలు

గుండ్లపల్లిలో ఉచిత వైద్యశిబిరం

కథలాపూర్: మేడిపెల్లి మండలం గుండ్లపల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వర్షాకాలం జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని ముందస్తుగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర, సర్పంచ్ సంపత్‌కుమార్, ఉపసర్పంచ్ సంజన, ఏఎన్‌ఎం సరస్వతి పాల్గొన్నారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేట వద్ద రెండు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన, రోడ్డు వద్ద అధికారులు శనివారం తాత్కాలిక మరమ్మతులు చేశారు. భారీ వర్షాలు, వరదలకు కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారులు తాత్కాలికంగా పైపులు వేసి, మట్టిపోసి పునరుద్ధరించారు.

కల్లూర్ వంతెనకు..

కోరుట్ల రూరల్: మండలంలో కురిసిన భారీ వర్షాలకు కల్లూరు వాగుపై వంతెన దెబ్బతినటంతో వంతెనపై రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో కల్లూర్ సర్పంచ్ వనతడుపుల అంజయ్య ఆధ్వర్యంలో శనివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చిన్న వాహనాలు వెళ్లేలా పునరుద్ధరించారు.

దెబ్బతిన్న రోడ్లు, చెక్ డ్యాంల పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను డీఈ గోపాల్ శనివారం పరిశీలించారు. మండలంలోని సంగెం, నాగులపేట బీటీ రోడ్డును పరిశీలించి మరమ్మతుల కోసం నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని డీఈ తెలిపారు. సంగెం- యెఖీన్‌పూర్ పెద్ద వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం-వంతెన వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ చెప్యాల నర్సయ్య, ఏఈ ఆదిత్య ఉన్నారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

ధర్మపురి: ధర్మపురి రోడ్లపై చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన డేరాలను శనివారం సీఐ రమణమూర్తి తొలగించారు. నందీ చౌక్ నుంచి ఆలయం వరకు రోడ్డుపై అమ్మకాలు చేపడుతున్న వాపారులతో మాట్లాడి తొలగింపజేశారు. ధర్మపురి పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, రోడ్డుపై క్రయ విక్రయాలు జరుపవద్దని సూచించారు. ఆలయం వద్ద రహదారి ఇరుకుగా ఉన్నందునా రాకపోకలకు ఇబ్బందులు కలుగవద్దనే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న డేరాలను తొలగించారు. రోడ్లపై అమ్మకాలు జరిపితే చర్యలుంటాయని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ధర్మపురి: పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సాయిని సత్యనారాయణ అన్నారు. ధర్మపురి పట్టణంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి సభ్యుడు తన వంతుగా 30 మొక్కలను నాటి, వాటిని సంరక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పెద్ది శివకుమార్, డీసీలు డాక్టర్ రామకృష్ణ, పిన్న శ్రీనివాస్, కట్ట శ్రీహరి, జనార్దన్ సిండే, కాసర్ల వెంకటరమణ తదితరులున్నారు.